ప్రజాశక్తి
శుక్రవారం 18 అక్టోబర్ 2024 5 అనంతపురం





వాల్మీకి జయంత్యుత్సవాల్లో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు

ప్రతిపక్షంలో ఉంటేనే రైతులు గుర్తుకు వస్తారా..?

◆ అన్నదాతలు కష్టాల్లో ఉన్నా పాలకుల మొద్దునిద్ర
◆ సాగునీటిని అందించడంలో విఫలం
◆ ప్రభుత్వాల తీరుపై సిపిఎం నాయకుల ఆగ్రహం
◆ 3వ రోజు కొనసాగిన సిపిఎం బస్సుయాత్ర

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్, పామిడి, శింగనమల, గార్లదిన్నె

ప్రధాన రాజకీయ పార్టీల నాయకులకు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మాత్రమే రైతులు, వారి సమస్యలు గుర్తుకు వస్తాయని, అధికారంలోకి రాగానే రైతాంగాన్ని విస్మరించడం పరిపాటిగా మారుతోందని సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలక ప్రభుత్వాలు రైతుల సంక్షేమంపై కనీస చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించడం విచారకరం అన్నారు. సాగునీటి కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర 3వ రోజు గురువారం గుంతకల్లు, పామిడి, గార్లదిన్నె, శింగనమల మండలాల్లో కొనసాగింది. దోనిముక్కల గ్రామంలో ప్రారంభం అయిన యాత్ర అయ్యవారిపల్లి, పామిడి, కల్లూరు, తరిమెల, పెద్దవడుగూరు, క్రిష్టపాడు, తదితర గ్రామాల్లో కొనసాగింది. ఆయా ప్రాంతాల్లో సిపిఎం నాయకులు కాలువలను పరిశీలించి రైతులు, ప్రజలతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ మాట్లాడుతూ గుంతకల్లు మండలంలో 12 గ్రామాలకు ప్రధానంగా మూడు చెరువులు, రెండు కుంటలు ఉన్నాయన్నారు. వీటిలో పులిగుంటపల్లి చెరువు ఒక్కసారి నిండితే సంవత్సరం కాలం పాటు నల్లదాసరిపల్లి, పులిగుంటపల్లి, నెలగొండ, చిన్నితండా పెద్దతండా గ్రామాల రైతుల బోరుబావుల్లో భూగర్భ జలాలు సమృద్ధిగా వస్తాయన్నారు. ఈ చెరువుకు నీరు ఇవ్వడంలో పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు.



గుంతకల్లు మండలం పులగుట్టపల్లి గ్రామ చెరువును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

చెరువు నిండా కంప చెట్లు పెరిగి అడవిని తలపిస్తోందన్నారు. నాగసముద్రం, అయ్యవారిపల్లి తదితర చెరువుల్లోనే ఇదే పరిస్థితి ఉందన్నారు. చెరువులకు నీటిని నిలువ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. చెరువుల్లో నీరు, భూగర్భ జలాలు అడుగంటి పోవడవంతో పంటల సాగు విస్తీర్ణం ఏడాదికేడాది గణనీయంగా తగ్గుతోందని చెప్పారు. సాగుభూములను బీడుగా ఉంచుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వం రూ.600 కోట్లతో రాగులపాడు లిఫ్ట్ నుంచి కాలువల ద్వారా గుంతకల్లు మండలంలో 12 గ్రామాలకు తాగు, సాగునీరు ఇచ్చేందుకు పనులను ప్రారంభించారన్నారు. ఈ పనులు భూమిపూజతోనే ఆగాయన్నారు. కాలువ పనులు పూర్తయ్యి సాగునీరు వస్తాయన్న ఆశతో రైతులు ఎక్కువ మొత్తంలో మిరప పంటను సాగు చేశారన్నారు. పంట సాగు అనంతరం కాలువలకు నీరు వదలకపోవడంతో పంట మొత్తం పూర్తిగా ఎండిపోయిందన్నారు. పోయిన సంవత్సరం మిరపకు ధర లేకపోవడం వల్ల పంటను ఇప్పటికీ రైతులు గిడ్డంగల్లో నిల్వ ఉంచుకున్నారన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో రైతులకు అన్ని విధాలా నష్టం వాటిల్లితోందన్నారు. రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 12 గ్రామాలకు సాగు, తాగునీరు అందించేందుకు అన్ని విధాలా అవకాశం ఉన్నా పాలకులు అటువైపు దృష్టి సారించకపోవడం విచారకరం అన్నారు. హెచ్ఎల్సి కాలువల ఆధునీకరణ పనులను వెంటనే చేపట్టాలన్నారు. ఉంతకల్లు జలాశయ నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలన్నారు. భైరవానితిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి నుంచి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలన్నారు. పీఏబీఆర్ కుడికాలు కింద ఉన్న 49 చెరువులకు నీరు అందించాలన్నారు. హెచ్ఎల్సి 5వ కాలువ డిస్ట్రిబ్యూటర్ పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీటిని అందించాలన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పంట నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వాలు మొద్దు నిద్ర వీడి సాగునీటి కాలువలన్నింటినీ మరమ్మతు చేసి చెరువులను పూర్తి స్థాయిలో నీటితో నింపాలని డిమాండ్ చేశారు. సాగునీరు, రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 21వ తేదీన సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, సావిత్రి, తరిమెల నాగరాజు, గుంతకల్లు పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, నాయకులు వైటి.చెరువు రమేష్, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాషా, సిపిఎం సీనియర్ నాయకుడు అనిమిరెడ్డి, పామిడి, శింగనమల, గార్లదిన్నె మండల కార్యదర్శులు మల్లేష్, భాస్కర్, చెన్నారెడ్డి, బి.తిమ్మప్ప, నిర్మలమ్మతో పాటు ఆయా మండలాల సిపిఎం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు బస్సుయాత్ర ఇలా..

పుట్లూరు	ఉ॥10.00గం॥
కడవకల్లు	11.00గం॥
మడుగుపల్లి	11.40గం॥
నార్పల	12.10గం॥
వెంకటాపురం	1.30గం॥
రెడ్డి పల్లి	2.00గం॥
కొర్రపాడు	2.50గం॥
శింగనమల	3.10గం॥
గార్లదిన్నె	4.00గం॥
మర్తాడు	రా॥6.00గం॥

గిడ్డంగుల్లోనే మిరప పంటను ఉంచాం..

సిపిఎం నాయకుల ఎదుట రైతుల ఆవేదన



సిపిఎం నాయకుల ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

గిట్టుబాటు ధర లేక ఇప్పటికీ సీతలగిడ్డంగుల్లోనే మిరప పంటను ఉంచుకున్నామంటూ పలువురు రైతులు సిపిఎం నాయకుల ఎదుట వాపోయారు. సిపిఎం బస్సుయాత్ర గుంతకల్లు మండలం పులగుట్టపల్లి గ్రామానికి వెళ్లిన సమయంలో రైతులు రాముడు, లింగన్న తదితరులు వారి కష్టాలను తెలియజేశారు. తమ గ్రామంలో అత్యధిక మంది బేడ మిరప పంటను సాగు చేస్తామన్నారు. పంట సాగుకు ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లేదన్నారు. రెండు సంవత్సరాల క్రితం సాగు చేసిన పంటను ఇప్పటికీ అలాగే గిడ్డంగిలో ఉంచామన్నారు. గత సంవత్సరం చెరువుకు నీరు ఇవ్వకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి పంటను పూర్తిగా నష్టపోయామన్నారు. రైతుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

బస్సుయాత్రకు మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ సంఘీభావం



బస్సుయాత్రలో పాల్గొని సంఘీభావం తెలుపుతున్న డా॥గేయానంద్

సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్రకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్.ఎం.బాషాలు పామిడిలో సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో పంటల సాగు కోసం నీరే ప్రాణాధారం అన్నారు. తుంగభద్ర, శ్రీశైలం డ్యామ్‌ల ద్వారా పంటల సాగు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ నీటిని అందించడంలో పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. హెచ్ఎల్సి కాలవను ఆధునీకరణ చేసి నీటిని విడుదల చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. సాగునీటి కోసం సిపిఎం చేస్తున్న న్యాయమైన డిమాండ్ పరిష్కారానికి జిల్లా అభివృద్ధి కాంక్షించే వారందరూ సంఘీభావం తెలపాల్సిన అవసరం ఉందన్నారు. మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా మాట్లాడుతూ కాలువలలో ఆధునీకరించి చెరువులు కుంటలకు అనుసంధానం చేస్తే ఆయా గ్రామాలకు నీరు అందే ఆస్కారం ఉందన్నారు.

మహనీయుడు వాల్మీకి

◆ కుటుంబ, పరిపాలనను తెలియజేసే కావ్యం రామాయణం
◆ రాష్ట్రస్థాయి వాల్మీకి జయంత్యుత్సవాల్లో ప్రజాప్రతినిధులు



వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కుటుంబ బంధాలు, రాజ్య పరిపాలన గురించి రామాయన మహాకావ్యం ద్వారా తెలియజేసిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు. అనంతపురం జిల్లా కేంద్రంలో వాల్మీకి రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాలను గురువారం నిర్వహించారు. ముందుగా నగరంలోని పవర్ ఆఫీస్ దగ్గర ఉన్న వాల్మీకి విగ్రహానికి రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్.రాజు ఎంపీలు అంబికా లక్ష్మినారాయణ, బికె.పార్థసారథి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, రాష్ట్ర బిసి.వెల్ఫేర్, సెక్రటరీ పోలా భాస్కర్, ఏపీ బీసీ వెల్ఫేర్ సంచాలకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తదితరులు పూలమాలలు వేశారు. అనంతరం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుత్తి రోడ్డులో మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న బల్లా కన్వెన్షన్ హాల్లో సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రాసిన రామాయణం గురించి నేటి తరం పిల్లలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి కావ్యాన్ని రచించిన వాల్మీకి స్ఫూర్తినీయుడన్నారు. రాష్ట్రంలో వాల్మీకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రతి ప్రధాన జిల్లా కేంద్రంలో బీసీ భవనాల నిర్మాణాలను చేపడతామన్నారు. బీసీ స్టడీ సర్కిళ్లను పునరుద్ధరిస్తామని తెలియజేశారు. అనంతపురం టవర్ క్లాక్ బ్రిడ్జికి వాల్మీకి వారధిగా నామకరణం చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. పార్లమెంట్లో చర్చించి వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఎంపి బికె.పార్థసారధి తెలిపారు. వాల్మీకి జయంతి ఉత్సవాలు సందర్భంగా చిన్నారులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి, డిటిడబ్ల్యూఒ రామాంజనేయులు, బీసీ వెల్ఫేర్ అధికారులు, సిబ్బంది, వాల్మీకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వాల్మీకి వేషధారణలో బాలుడు


14,981 క్వింటాళ్ల పప్పుశనగ పంపిణీ

ప్రజాశక్తి -అనంతపురం

జిల్లాలో రబీ సీజన్‌కు నల్లరేగడి నేలల్లో సాగు చేసేందుకు అవసరమైన పప్పుశనగను రాయితీపై గురువారం నాడు జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఇప్పటికి 14,981 క్వింటాళ్లు రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. మంగళవారం వరకు 13,719 మంది రాయితీ పప్పుశనగ కోసం పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. నమోదు చేసుకున్న వారికి 19,289 క్వింటాళ్లు అవసరం అవుతాయని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఏపీ సీడ్స్‌ను ఆదేశించామన్నారు.

జిల్లా అంతటా వానజల్లు

కంబదూరులో అత్యధికం - డీ.హీరేహాళ్ అత్యల్పం



రాయదుర్గంలో తడిసిన మొక్కజొన్నను ఆరబోస్తున్న రైతులు

ప్రజాశక్తి-అనంతపురం

తుపాను ప్రభావంతో గురువారం కూడా జిల్లాలో జడి వాన పట్టుకుంది. చిరుజల్లులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లో ఒక మోస్తరు చిరుజల్లులు పడ్డాయి. భారీ వర్షమైతే ఎక్కడా నమోదవలేదు. అత్యధికంగా కంబదూరులో 47.8 మిల్లీమీటర్లు పడింది. శెట్టూరులో 40.8 మిల్లీమీటర్లు, కుందుర్పి 38 మిల్లీమీటర్లు, కళ్యాణదుర్గంలో 32.8 మిల్లీమీటర్లు, యల్లనూరులో 32 మిల్లీమీటర్లు, రాప్తాడు 31.8 మిల్లీమీటర్లు పుట్లూరు 30.6 మిల్లీమీటర్లు నమోదయింది. అత్యల్పంగా ఎనిమిది మిల్లీమీటర్లు పడింది. జిల్లా మొత్తంగా 20.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

వర్షలతో పంటలకు తీవ్ర నష్టం

రాయదుర్గం రూరల్ : తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పంటలు తడిసి ముద్దయ్యాయి. బొమ్మక్కపల్లి, ఆవులదట్ల, కదరంపల్లి గ్రామాలకు చెందిన రైతులు సాగు చేసిన మొక్కజొన్నను కోసం రాయదుర్గం - అనంతపురం ప్రధాన రహదారిపై ఆరబెట్టారు. దీంతో మొక్కజొన్న వానకు తడిసింది. దీంతోపాటు వేరుశనగ, మిర్చి తదితర పంటలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తడిసిపోయాయి. పొలాల్లో వర్షం నీరు నిలవడంతో పంటలు దెబ్బ తినే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

యల్లనూరులో 10.8 మి.మీ వర్షపాతం


యల్లనూరు : బంగాళాఖతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం 10.8 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ శేషారెడ్డి తెలిపారు. వర్షం కారణంగా మండలవ్యాప్తంగా ఎలాంటి నష్టం సంభవించలేదన్నారు.

వర్షాలకు పండ్ల తోటలకు భారీ నష్టం

బొమ్మనహాల్ : తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాల కారణంగా పండ్ల తోటలకు భారీ నష్టం సంభవించింది. ఇందులో భాగంగా మండల వ్యాప్తంగా రైతులు సాగుచేసిన పండ్ల తోటలతోపాటు మిరప, పత్తి, మొక్కజొన్న, దానిమ్మ, బత్తాయి, అంజూరా, బొప్పాయి, అరటి తోటలకు భారీ నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.


బిటిపికి జలకళ

బ్రహ్మసముద్రం : మండలంలో ఉన్న ఏకైక నీటి వనరు బైరవనితిప్ప ప్రాజెక్టు నీటితో కలకలాడుతోంది. ఐదు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో కర్ణాటక ఎగువ ప్రాంతం నుంచి వరద భారీగా వచ్చి బైరవానితిప్పకు చేరుతోంది. ప్రాజెక్టు మొత్తం 1,655 అడుగులు కాగా ప్రస్తుతం 1,648 అడుగుల వరకూ నీరు చేరిందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బైరవానితిప్ప ప్రాజెక్టు నిండటంతో మండల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. బిటిపి నీటి సామర్థ్యం 2 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.57 క్యూసెక్కుల మేర నీరు ప్రాజెక్టుకు చేరిందని అధికారులు తెలిపారు.



నీటితో బైరవానితిప్ప ప్రాజెక్టు

ఆయన తీరే వేరు..!



◆ జలవనరుల శాఖ కాంట్రాక్టర్ల గగ్గోలు
◆ ఏళ్లు గడుస్తున్నా బిల్లులు పెట్టని ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్
◆ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

అనంతపురం జలవనరుల శాఖలో ఒక డివిజన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరుగా పనిచేస్తున్న ఆ అధికారి తీరే వేరు అన్నట్టుగా ఉంది. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి కాంట్రాక్టర్లు పనులు చేస్తే వాటికి సంబంధించిన బిల్లులు ఏళ్లు గడుస్తున్నా పెట్టకపోవడంతో సదరు కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. ఈ మేరకు గ్రీవెన్స్‌లో వారి సమస్యను మొరపెట్టుకున్నారు. అయినా ఫలితం లేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2018-19 సంవత్సరాల్లో నీరు చెట్టుకింద హెచ్ఎనసి పరిధిలో పనులు చేపట్టారు. ఇందులో హెచ్ఎల్సి అనంతపురం డివిజన్ పరిధిలో కొంత మంది కాంట్రాక్టర్లు పనులు చేశారు. 2019లో ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే పనులపై విచారణను చేపట్టింది. ఆ విచారణలో సరిగా ఉన్నాయన్న వాటికి బిల్లులను చెల్లించింది. ఈ డివిజన్ పరిధిలో సుమారు 18 పనులను పూర్తి చేశారు. కోటి రూపాయలకుపైగా విలువైన పనులను కాంట్రాక్టర్లు చేశారు. విచారణలోనూ ఇవి సరిగా ఉన్నాయని తేల్చారు. పైగా న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో బిల్లులు చెల్లించమని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ పనులకు కూడా సదరు ఇంజినీరు బిల్లులు చెల్లింపునకు చర్యలు తీసుకోలేదు. ఈ నెలాఖరుకు ఆ అధికారి రిటైర్డు కూడా అవనున్నారు. ఆయన పరిధిలో జరిగిన పనులకు బిల్లులు చెల్లించకుండా ఇతర కారణాలతో కొర్రీలు వేస్తుండటంతో కాంట్రాక్టర్లు గ్రీవెన్స్‌లో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. అయినా ఆ అధికారి నుంచి ఎటువంటి స్పందనా లేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిటైర్డు అయితే మొత్తం బిల్లులు రాకుండా ఆగిపోయే అవకాశముందని, లక్షలు అప్పులు చేసి పనులు చేసామని గుత్తేదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంతవాహనానికి బిల్లులు

ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరు కావడంతో ఆయన పనుల పర్యవేక్షణ నిమిత్తం వెళ్లేందుకు ప్రభుత్వం తరుపున వాహనం ఏర్పాటు చేస్తారు. ఆయన పర్యటన ఎక్కువగా కాలువలపైనా ఉంటుండటంతో బొలేరో వాహనం లాంటిది కేటాయిస్తారు. ఆ అధికారి మాత్రం తన బంధువుల పేరున సొంత వాహనాన్నే ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. చిన్న వాహనంలో ఫీల్డ్ విజట్ చేయడానికి కూడా అనువుగాని వాహనం ఏర్పాటు చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనంలో తిరగకుండానే బిల్లులు డ్రా చేస్తున్నట్లు సమాచారం. వాహనం ఏర్పాటు, ఈ బిల్లులపై కొంత మంది గ్రీవెన్స్‌లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

అక్రమ కేసుల పేరుతో బెదిరింపు

డబ్బులు ఇవ్వాలని నకిలీ పోలీసు డిమాండ్ - మహారాష్ట్ర నుంచి ఫోన్‌కాల్

ప్రజాశక్తి-తాడిపత్రి

'మనీలాండరింగ్ కేసులో నీ పేరు ఉంది. ఇది చాలా పెద్ద కేసు. దీనికి శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అలా కాకుండా ఉండాలంటే తనకు రూ.50 వేలు నీ పేరు ఆ కేసులో లేకుండా చేస్తా.' అంటూ ఓ వ్యక్తికి మహారాష్ట్ర నుంచి నకిలీ పోలీసు ద్వారా బెదిరింపు ఫోన్‌కాల్ వచ్చింది. దీనిపై ఆందోళనకు గురైన బాధితుడు ఫోన్‌కాల్‌పై విచారణ చేయగా అసలు వాస్తవాలు వెలుగు చూశాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... తాడిపత్రికి చెందిన మార్కెటింగ్ చేసే నాగరాజుకు గురువారం నాడు ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి మహారాష్ట్రలోని అలంబాగ్ ఎస్ఐ సునీల్ కుమార్ మిస్రాగా పరిచయం చేసుకున్నాడు. మనీ లాండరింగ్ కేసులో ఆధార్ నెంబరు అనుసంధానమై ఉందని, దీనిపై విచారణ చేస్తున్నామని, వాస్తవాలు వెలుగులోకి వస్తే పెద్ద శిక్ష పడుతుందని బెదిరించాడు. ఈ కేసు నుంచి బయట పడలాంటే తన అకౌంట్లోకి రూ.50వేలు వేస్తే కేసు నుంచి తప్పిస్తానంటూ తెలిపాడు. తాను మార్కెటింగ్‌లో చిరు ఉద్యోగినని తనకు ఎలాంటి కేసులతో సంబంధం లేదంటూ నాగరాజుకు అతనికి చెప్పే ప్రయత్నం చేసినా పట్టించుకోకుండా రూ.50వేలు కావాలంటూ డిమాండ్ చేశాడు. వెంటనే బాధితుడు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి ఫొటో, ఆయన ఫోన్ నెంబర్‌ను ఇచ్చాడు. తను బెదిరిస్తున్న వ్యక్తి నుంచి రక్షణ కల్పించాలంటూ పోలీసులను వేడుకున్నాడు. దీనిపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఫోన్ చేసిన వ్యక్తి

కుంటలను తలపిస్తున్న తాడిపత్రి రోడ్లు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

చిన్నపాటి వర్షం పడితే చాలు తాడిపత్రిలోని రోడ్లు చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా వర్షం వచ్చిన ప్రతిసారి పట్టణంలోని నంద్యాల రోడ్డు భారత్ పెట్రోల్ పంపు ఎదురుగా నీటికుంటా మారుతుండటంతో పాదాచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడే నీటి కొళాయి పైపు ఉండటంతో అప్పుడప్పుడు పైపులు పగులుతూ నీరు ప్రవహిస్తూ ఉంటుంది. దీనికితోడు ఇంటి యజమానులు ప్రధాన రోడ్డును పగులగొట్టి పైపులు వేసుకుంటూ ఉంటారు. తద్వారా ఏర్పడిన గుంతల కారణంగా ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కింద పడి గాయాలపాలవుతున్నారు. ఇక పాదాచారులు అక్కడ నడవడానికి మోకాలు లోతు నీరు ఉండటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా అక్కడ నిర్మాణాలు చేపట్టడం వల్ల రోడ్డు పక్కన ఉన్న కాలువ పూర్తిగా పూడికతో నిండి ఉంటోంది. సమస్య పరిష్కరించాలని గత బుధవారం రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పట్టణవ్యాప్తంగా నిర్వీర్యమైన డ్రెయినేజీ వ్యవస్థను పునరుద్ధరించి సుందర తాడిపత్రిగా మార్చాలని కోరారు.



రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

ప్రజాశక్తి కథనానికి స్పందన

చివరి ఆయకట్టు వరకూ నీరు అందిస్తాం..


కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా లేఖ రాసిన ఇఇ

ప్రజాశక్తి-గుత్తి

చంద్రాయిని కుంట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సిబిఆర్) నుంచి చివరి ఆయకట్టు వరకూ నీరు అందిస్తామని గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.వెంకటరమణ స్వయానా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా లేఖ రాశారు. ఈనెల 12వ తేదీన 'నీరు వృథా.. రైతులు వ్యథ' పేరుతో ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు కథనంపై గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివరణ కోరారు. ఇందుకు ఇఇ స్పందిస్తూ చంద్రాయిని కుంట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సిబిఆర్)లో నీరు ఉండడం వల్ల తూము (షట్టర) మరమ్మతులు సీజన్ ముగిసిన అనంతరం చేపడతామన్నారు. అలాగే కాలువ ఆధునీకరణ పనుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. నీటిని కాలువ చివరి వరకు సరఫరా చేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివరించారు.

ఎడిసిసి బ్యాంకు మేనేజర్లతో సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం


సమావేశంలో పాల్గొన్న ఎడిసిసి బ్యాంకు మేనేజర్లు

నగరంలోని ఎడిసిసి బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్రాంచి మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా సహకార సంఘాల కంప్యూటరీకరణ, ప్రగతి పురోగతిపై బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి శివనారాయణశర్మ సమీక్షించారు. పురోగతి మందకొడిగా ఉన్న సంఘాలకు సంబంధించిన బ్రాంచి మేనేజర్లు వివరణ ఇవ్వాలని సూచించారు. అన్ని బ్రాంచులలో త్వరితగతిన కంప్యూటరీకరణ, ఆధునీకరణ అంశాలను పూర్తి చేయాలనాదేశించారు. డిపాజిట్ల సేకరణ విషయంలో క్షేత్రస్థాయిలో నాణ్యత, నమ్మక ప్రమాణాలతో ముందుకెళ్లాలన్నారు. ముఖ్యంగా నూతన డిపాజిట్ల పథకం 440 రోజులు వడ్డీ రేట్లు, సీనియర్ సిటిజెన్‌లకు 8.35శాతం, ఇతరులకు 7.85శాతం వంటి అంశాలను ఖాతాదారులకు అవగాహన కల్పించి అత్యధికంగా డిపాజిట్లు సేకరించినందుకు ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిఇఒ కె.సురేశారాణి, జిల్లా సహకార అధికారి అరుణకుమారి, నాబార్డ్ డిడిఎం అనురాధ, డిఎల్ఎల్ డి ప్రభాకర్‌రెడ్డి, డిఆర్ఒఎస్‌టి సుదర్శన, నారాయణ, డిజిఎం రామ్‌ప్రసాద్, సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి, డిపిడిఎం తేజస్వీణి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టుశిక్షణ

అనంతపురం రూరల్ : ఆకుతోటపల్లి వద్ద ఉన్న రూడ్‌సెట్‌లో మహిళలకు టైలరింగ్, మగ్గంవర్క్, పురుషులకు కంప్యూటరైజ్‌డ్ అకౌంటింగ్‌లో 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కార్యాలయ అధికారి తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్.. 08554-255925, 8309915577ను సంప్రదించాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పామిడి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తేజోష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి బోగాతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేహానికి మండల పరిధిలోని అన్నిశాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు హాజరుకావాలని కోరారు.

బిసిలకు రక్షణ చట్టం అభినందనీయం

అనంతపురం : రాష్ట్రంలో 56శాత శాతం ఉన్న బలహీన వర్గాల ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం బిసిల రక్షణచట్ట తీసుకురావడం అభినందనీయమని ఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు పోతుల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అయితే హామీ మాటలు, ప్రకటనలకు పరిమితం కాకుండా జనాభా ప్రాతిపదికన అన్నిరంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా చట్టసభల్లో రిజర్వేషన్ కోసం బలహీన వర్గాలు 35ఏళ్ల నుంచి ఉద్యమాలు చేస్తున్నాయన్నారు. వాటిని అమలు చేయాలని కోరారు.

'సజ్జల'కు లుక్‌అవుట్ నోటీసుల జారీ అన్యాయం

ఉరవకొండ : మాజీ సిఎం జగన్ సలహాదారుడిగా పనిచేసిన సజ్జల రామకృష్ణారెడ్డిపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేయడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో విచారణకు హాజరుకావాలని గుంటూరు ఎస్పీ కార్యాలయం మంగళగిరి పోలీసులు నోటీసులు జారీ చేయడం హేమమైన చర్య అన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి వైసిపి ఆవిర్భావం నుంచి కీలకపాత్రం పోషించారన్నారు. అలాంటి ఆయనకు నోటీసులు జారీ చేయడం బాధాకరమన్నారు.

సాగునీటి కోసం 21న మహాధర్నా

సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు

జిల్లాలోని తాగు, సాగు నీటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 21వతేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా రైతులకు ఉపయోగపడే విధంగా సాగునీటి ప్రాజెక్టులకు నిధులను కేటాయించకపోవడంతో రైతులు కరువు బారిన పడుతున్నారన్నారు. ముఖ్యంగా హెచ్ఎల్‌సి ఆధునీకరణ పనులు చేపట్టాలని కోరారు. ఒకవైపు వర్షాలు వచ్చి తుంగభద్ర జలాశయం నుంచి నీరు వృథాగా వెళ్తున్నా సద్వినియోగం చేసుకోలేని స్థితిలో ఉన్నామన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టినట్లు తెలిపారు. యాత్ర ముగింపు సందర్భంగా 21వ తేదీ సోమవారం కలెక్టరేట్ ముందు మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, మసూద్, ఎర్రిస్వామి, ప్రసాద్, వెంకటేశు, గఫూర్, జీవ, నూరుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయొద్దు

డిఇఒకు ఉపాధ్యాయ సంఘాల నేతలు వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


డిఇఒకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

వివిధ శిక్షణల పేరుతో ఉపాధ్యాయులకు ఒత్తిడికి గురి చేయొద్దని ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ వరలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ 1, 2 తరగతులను బోధించే ఉపాధ్యాయులకు ఈనెల 21 నుండి 26 వరకు ఆరు రోజులపాటు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వడం వల్ల వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సీనియర్ ఉపాధ్యాయులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లిదండ్రులు, వృద్ధులైన తల్లిదండ్రుల బాధ్యతలను చూసుకోవాల్సిన ఉపాధ్యాయులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారన్నారు. కనుక రీసోర్స్‌పర్సన్లకు ముందుగా శిక్షణ ఇచ్చి, వారి ద్వారా ప్రతి మండలంలోగానీ, రెండు, మూడు మండలాలకు కలిపికానీ శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సి రాజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్‌వలి, వెంకటరమణ, జిల్లా ఆడిట్ కన్వీనర్ వన్నప్ప, నాయకులు రంగనాయకులు, సూర్యనారాయణ, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు రాజీలేని పోరాటం

లియాఫీ పొలిటికల్ ఛైర్మన్ నారాయణరెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం



సమావేశంలో మాట్లాడుతున్న లియాఫీ జాతీయ అధ్యక్షుడు నారాయణరెడ్డి

అఖిలభారత జీవిత బీమా సంస్థ ఏజెంట్ల హక్కుల సాధన కోసం యజమాన్యంతో రాజీలేని పోరాటం చేస్తున్నామని ఆలిండియా ఎల్ఐసి ఏజెంట్ల సమైక్య సంఘం వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కమిటీ (లియాఫీ) ఛైర్మన్ ఎం.నారాయణరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని మధ్యానేశ్వరస్వామి ఆలయంలో ఎల్ఐసి ఏజెంట్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐసి ఏజెంట్ల సంక్షేమంతోపాటు పాలసీదారుల బోనస్ పెంచే విషయంలో జీవిత బీమా సంస్థ యజమాన్యంతో చర్చలు సాగుతూనే ఉన్నాయన్నారు. ప్రపంచంలో 4వ ఆర్థిక సంస్థగా జీవితబీమా సంస్థ నిలబడిందన్నారు. ఇందుకు ఏజెంట్ల శ్రమ, సేవలు వల్లనే సాధ్యమైందన్నారు. ఈనేపథ్యంలో ఎల్ఐసి ఏజెంట్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే దేశమంతటా నిరసన చేపట్టడానికి ఏజెంట్లు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాయదుర్గం కళ్యాణదుర్గం ఎల్ఐసి ఏజెంట్ల సంఘం అధ్యక్షుడిగా జి.నాగరాజు, కార్యదర్శిగా బి.బ్రహ్మానంద, కోశాధికారిగా నిసార్‌అహ్మద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆలిండియా ఇండియా లియాఫీ (1964) వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ ఎం.నారాయణరెడ్డి, కడప డివిజన్ లియాఫీ(1964) అధ్యక్షులు జయభారత్‌రెడ్డి, నాయకులు కృష్ణ, నగేష్, రాయదుర్గం, కళ్యాణదుర్గం బ్రాంచ్ పరిధిలో ఉన్న ఏజెంట్లు పాల్గొన్నారు.

విజయవాడ నుంచే హజ్‌యాత్రను కొనసాగించాలి

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి -అనంతపురం



విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్ నుంచే హజ్‌యాత్రను కొనసాగించేలా కూటమి నేతలు కృషి చేయాలని మేయర్ మహమ్మద్ వసీం కోరారు. గురువారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో రాష్టంలోని ముస్లిములు హజ్‌యాత్రకు వెళ్లాలంటే హైదరాబాద్, బెంగళూరు నుంచి వెళ్లాల్సి ఉండేదన్నారు. దీంతో 50 ఏళ్లు పైబడిన వారు ఇబ్బందులు పడేవారన్నారు. ఈనేపథ్యంలో గత వైసిపి ప్రభుత్వంలో సమస్యను అప్పటి సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా విజయవాడ విమానాశ్రయం నుంచే హజ్‌యాత్రకు వెళ్లేలా చర్యలు చేపట్టారన్నారు. తద్వారా హైదరాబాద్, బెంగుళూరు విమానాశ్రయాలతో పోల్చితే విజయవాడ విమానాశ్రయం నుంచి వెళ్లే ఒక్కో హజ్ యాత్రికుడిపై రూ.83వేల భారం తగ్గుతుందన్నారు. కావున కూటమి ప్రభుత్వం కూడా విజయవాడ నుంచే హజ్‌యాత్రను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే హజ్‌యాత్రకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి సాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు ఇషాక్, రహంతుల్లా, నాయకులు హుస్సేన్‌పీరా, తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ కార్యక్రమం

బెలుగుప్ప : మండల పరిధిలోని నరసాపురం గ్రామంలో గురువారం గొర్రెలు, మేకలకు సామూహిక ఉచిత నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 4,896 జీవాలకు నట్టల నివారణ మందులు తాపినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎ.రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ప్రసాద్, గ్రామ నాయకులు గిరీష్, పశువైద్య సిబ్బంది మారుతి, ఎర్రిస్వామి, చంద్ర, విజయ్‌కుమార్, సుధాకర్‌నాయక్, రవికుమార్, గొర్రెల కాపరులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం

గుత్తి : మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయ ముఖద్వారాన్ని మాజీ ఎమ్మెల్యే కోట్రికే మధుసూదన్‌గుప్తా గురువారం ప్రారంభించారు. గ్రామంలోని గురు రాఘవేంద్రస్వామి ఆనందాశ్రమంలో మాజీ ఎమ్మెల్యే సహకారంతో లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ ఆధ్వర్యంలో ఆలయంలో ముఖద్వారం నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ముఖద్వారాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి వాసుదేవరెడ్డి, గ్రామస్తులు జయరంగారెడ్డి, వలి, గుత్తి టౌన్ బ్యాంకు డైరెక్టర్ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

నార్పల : మండల కేంద్రంలోని సిపిఐ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో ఎంపిడిఒ గంగావతికి గురువారం వినతిపత్రం అందజేశారు.ఇ ందుకు స్పందించిన ఎంపిడిఒ కాలనీలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గంగాధర్, సహాయ కార్యదర్శి రమేష్, సీనియర్ నాయకులు సుధాకర్, నారాయణప్ప, సీనా, తదితరులు పాల్గొన్నారు.

22న కలెక్టరేట్ ముందు ధర్నా

అనంతపురం : బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి చేతివృత్తులను కాపాడాలని కోరుతూ ఈనెల 22న కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు సి.లింగమయ్య, గొర్లు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోతలయ్య తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో కార్పొరేషన్లకు ఒక్కపైసా కేటాయించిన పాపాన పోలేదన్నారు. కావున కనీసం కూటమి ప్రభుత్వం అయినా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి సివి.హరికృష్ణ, స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు బంగారు బాషా, నాయీబ్రాహ్మణ వృత్తిదాల సమాఖ్య నగర అధ్యక్షులు గోవిందరాజులు, రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు సి.నాగప్ప, జిల్లా సహాయ కార్యదర్శి సి.ఆదినారాయణ, నగర గౌరవాధ్యక్షులు ఈశ్వరమ్మ, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించాలి

అనంతపురం : జిల్లావ్యాప్తంగా 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యాలు పెంపొందించే ఆలోచనతో జ్ఞానప్రకాశ్ 60 రోజుల సర్టిఫికెట్ కోర్సును నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా మొదటి విడత ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను అక్టోబర్ 21 నుంచి 26వతేదీ వరకూ బుక్కరాయసముద్రంలోని విద్యాభారతి డిఎడ్ కళాశాలలో అనంతపురం, కర్నూలు జిల్లాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

పప్పుశనగ పంపిణీ


పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు

పుట్లూరు : మండలంలోని కడవకల్లు రైతు సేవాకేంద్రంలో సబ్సిడీ పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవర్ధన్‌రాజు, నాగేశ్వర్‌రెడ్డి, మల్లికార్జున, పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాయిట్రస్టు సేవలు అమోఘం


ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న సాయిట్రస్టు అధ్యక్షులు విజయసాయికుమార్

అనంతపురం : 2015 నుంచి వందలాది మంది మృతుల కుటుంబాలతో మాట్లాడి నేత్రదానం చేయించిన సాయిట్రస్టు చేస్తున్న సేవలు అమోఘమని ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి ఫౌండర్, ఛైర్మన్ డాక్టర్ జిఎస్.రావు కొనియాడారు. నేత్రదానంలో సాయిట్రస్టు సేవలను అభినందిస్తూ హైదరాబాదులోని బంజారా హిల్స్‌లోని ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయి ట్రస్టు అధ్యక్షులు విజయసాయికుమార్‌కు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా జిఎస్.రావు మాటల్లాడుతూ ఎల్.వి ప్రసాద్ కంటి ఆసుపత్రిలో ఇప్పటి వరకూ 50వేల మందికి కార్నియాను అమర్చి వారి జీవితాల్లో వెలుగును నింపిన శుభ సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కెవిపి.రామచంద్రరావు, లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు జయప్రకాశ్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నార్పల : ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో సిఐ కౌలుట్లయ్య ఆధ్వర్యంలో పోలీసులు గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహంచారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని సిపిఐ కాలనీ, చైతన్య కాలనీలో తనిఖీలు నిర్వహించగా ఎలాంటి రికార్డులు లేని 15 ద్విచక్ర వాహనాకు సీజ్ చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. అనంతరం చోరీలు, చైన్ స్నాచింగ్స్‌పై అవగాహన కల్పించారు. మండల పరిధిలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నా.. ఎక్కడైనా మారనాయుధాలు కలిగి ఉన్నా.. అసాంఘిక కార్యకలాపాలు పేకాట, జూదం, మట్కా, వ్యభిచారం జరుగుతున్నా తమకు సమాచారం అందజేయాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

యాడికి : వెక్టార్ కంట్రోల్ హైజిన్‌లో భాగంగా గురువారం తిరునామ్‌పల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మలేరియా యూనిట్ ఆఫీసర్ చిగురుపాటి శ్రీనివాసులు వ్యాధులపై అవగాహన కల్పిస్తూ నీటితొట్ల శుభ్రం చేయించారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తాడపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఏఎన్ఎం ప్రమీలమ్మ, ఎంఎల్‌హెచ్‌పి సబిహా, 104 డిఇఒ అనిల్, ఆశాకార్యకర్త, తదితరులు సరస్వతి పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహప్రతిష్టాపన

గుత్తి : మండలంలోని బేతాపల్లి గ్రామంలో వరలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో వేకువజాము నుంచే అర్చకులు గణపతి పూజ,స్వస్తి వాచనం, కంకణధారణ, మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, రుద్ర స్వహాకార హోం, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు, సీనియర్ నాయకుడు కప్పలబండ మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్ వరదరాజులు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గంగరాజు, ఆంజనేయులు, సుంకయ్య, కంబయ్య,పుల్లెప్ప, హరికష్ణ, గోవిందుగౌడ్, అక్బర్, వలి, మధు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నార్పల : మండల పరిధిలోని శిద్ధరాచర్ల సచివాలయంలో సర్పంచి సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో నంద్యాల శాంతిరాం మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దాదాపు 109 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శస్త్రచికిత్సలు అవసరం ఉన్న వారికి శాంతిరాం ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాకే వెంకటరమణ, రవీంద్రారెడ్డి, సాకే శివయ్య, దుర్గం నారాయణ, ఏఎన్ఎం ఫరీదాభాను, ఎంఎల్‌హెచ్‌పి అమృతాంజలి, గోపాలమిత్ర నరసప్ప, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మహేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

21న స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం : జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శన్‌రావు ఆదేశాల మేరకు స్థానిక ఒటిపిఆర్ఐ కళాశాలలో మిగిలిన కన్వీనర్ ఎంఎస్‌సీ సీట్లకు ఈనెల 21వతేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ అడ్మిషన్ ఆర్.కిరణ్మయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి పిజి సెట్ -2024లో అర్హత సాధించడంతోపాటు, డిగ్రీలో ఉత్తీర్ణులైన వారు అడ్మిషన్లకు అర్హులు అన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు, జిరాక్స్ కాపీలను తీసుకుని ఉదయం 9 గంటలకు అనంతపురం జెఎన్‌టియు డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగులోని కార్యాలయానికి రావాలని కోరారు. ఇతర వివరాలు, ఫీజు వివరాలు, అప్లికేషన్ కోసం www.jntua.ac.inను సంప్రదించాలని కోరారు.

గుత్తిలో అన్న క్యాంటీన్ ప్రారంభం

గుత్తి : పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కమిషనర్ బి.జబ్బర్‌మియా, టిడిపి నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ, పట్టణ, మండల అధ్యక్షులు ఎంకె.చౌదరి, బద్దివలి, నాయకులు కోనంకి కృష్ణ, సి.లక్ష్మణ్‌చౌదరి, జక్కలచెరువు ప్రతాప్, చికెన్ శీనా, జి.సుంకన్న, పి.శ్రీనివాస్‌చౌదరి, వాసు, పిల్లెల్లి కృష్ణయ్య, సర్పంచులు పి.భరత్‌కుమార్, యు.లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలి : ఆర్‌డిఒ

బెలుగుప్ప : మండల పరిధిలోని ఆవులెన్న సహకార సంఘం సొసైటీలో ఉన్న రైతుల నెంబర్లకు ఆధార్ అనుసంధాన్ని త్వరగా పూర్తిచేయాలని ఆర్‌డిఒ వినూత్న ఆదేశించారు. గురువారం స్థానిక సొసైటీ సహకార సంఘాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఆవులెన్న సొసైటీ సహకార సంఘంలో 6,465 మంది మెంబర్లు ఉండగా 1,127 మంది మాత్రమే అప్‌డేట్ చేయించుకున్నారన్నారు. మిగిలిన రైతులను కూడా త్వరగా అప్‌డేట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఇఒ మల్లికార్జున, తహశీల్దార్ షర్మిల, సర్పంచు రామ్మోహన్‌చౌదరి, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

బోరంపల్లి పొలాల్లో చిరుత సంచారం

కళ్యాణదుర్గం రూరల్ : బోరంపల్లి గ్రామ పొలిమేరలో చిరుత పులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం బొలేరో వాహనంలో గంగవరం అరటి తోటకు వెళ్తున్న కూలీలు చిరుతను చూసి భయాందోళన చెందారు. చిరుత బోరంపల్లి నుంచి గంగవరం గ్రామం వైపు వెళున్నట్లుగా చూశామని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సమాచారాన్ని అటవీశాఖ అధికారులకు చేరవేశామని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

నేరాలు ఘోరాలు

వర్షాలకు ఎనుము మృతి


మృతిచెందిన ఎనుము వద్ద రైతు

తాడిపత్రి రూరల్ : వర్షం కారణంగా ఎనుము మృతిచెందిన ఘటన గురువారం మండల పరిధిలోని పెద్దపొలమడ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపొలమడ గ్రామానికి చెందిన అనంత కుళ్లాయప్పకు చెందిన సుమారు రూ.1.30లక్షల విలువజేసే ఎనుము వర్షానికి మృతిచెందింది. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. కాగా ఎనుమును కోల్పోయిన రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని ఎపి రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు. వెంటనే రూ.1.30లక్షల పరిహారం చెల్లించడంతోపాటు బీమాను వర్తింపజేయాలని కోరారు.





మహర్షి వాల్మీకి చిత్రపటాలు, విగ్రహాలకు పూజలు చేస్తున్న జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి సుదర్శనరావు, ఎస్పీ పి.జగదీష్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



గుత్తిలో మహర్షి వాల్మీకి విగ్రహాలని పూజలు చేస్తున్న నాయకులు, అధికారులు

కుటుంబ విలువలు నేర్పిన మహనీయుడు 'వాల్మీకి'



అనంతపురంలో వాల్మీకి జయంతి వేడుకలో పాల్గొన్న జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

జిల్లా వ్యాప్తంగా ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

సమాజానికి మానవతా విలువలు, ఉన్నతమైన ఆదర్శాలను తన రచనల ద్వారా నేర్పిన మహనీయుడు మహర్షి వాల్మీకి అని జెఎన్‌టియు ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్ హెచ్.సుదర్శన్‌రావు కొనియాడారు. గురువారం అనంతపురంలోని జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి విసి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి మానవత విలువలు, ఉన్నతమైన ఆదర్శాలను తన రామాయణంలో అడుగడుగునా బోధించారన్నారు. ప్రతి ఒక్కరూ వాల్మీకి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, విసి ఒఎస్‌డి ఎన్.దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు పి.ఆర్.భానుమూర్తి, పి.సుజాత, నాగప్రసాద్‌నాయుడు, పద్మసువర్ణ, ఎపి.శివకుమార్, శ్రీధర్, ఎం.అంకారావు, శారద, పిఆర్‌ఒ బి.ఓంప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, చంద్రమోహన్‌రెడ్డి, కళ్యాణిరాధా, జె.శ్రీనివాసులు, అజిత, ఫైనాన్స్ ఆఫీసర్ సిరాజుద్దీన్, డిప్యూటీ రిజిస్ట్రార్ రంగానాయక్, మధుసూదన్‌రెడ్డి, దుర్గాప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు నాగభూషణం, మురళీమోహన్, లింగప్ప, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


అలాగే శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో కన్వీనర్ ఎం.మునినారాయనప్ప ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎస్‌కెయు విసి బి.అనిత, రిజిస్ట్రార్ ఇ.రమేష్‌బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తర్వాత కర్నూలు కెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ సీనియర్ ఆచార్యులు దండేబోయిన పార్వతీదేవి, అనంతపురం ఆకాశవాణి ఉన్నత శ్రేణి వ్యాఖ్యాత జగర్లపూడి కీలకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతపురం క్రైం : వాల్మీకి మహర్షి చేసిన బోధనలు సమాజానికి చాలా అవసరమని ఎస్పీ పి.జగదీష్ అభిప్రాయపడ్డారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ డి.వి.రమణమూర్తి, ఏ.ఆర్ అదనపు ఎస్పీ జి.మునిరాజ, ఎస్‌బి సిఐలు ధరణీకిశోర్, క్రాంతికుమార్, ఆర్ఐలు రెడ్డెప్పరెడ్డి, మధు, జిల్లా పోలీసు కార్యాలయ ఎఒ శంకర్, సూపరింటెండెంట్లు ప్రసాద్, సావిత్రమ్మ, ఎస్పీ సిసి ఆంజనేయప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : త్వరలో కళ్యాణదుర్గంలో వాల్మీకి మహర్షి కాంస్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హామీ ఇచ్చారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వాల్మీకుల మధ్య మహర్షి వాల్మీకి జయంతి జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. పట్టణంలోని వాల్మీకి కూడలిని మరింత అభివృద్ధి చేసి ఆహ్లాదకరమైన సర్కిల్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. తర్వాత ఎమ్మెల్యే కార్యాలయం ప్రజావేదికలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు.

బ్రహ్మసముద్రం : వాల్మీకులు విద్య, వైద్య, ఆరోగ్య, ఆర్థిక, తదితర రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని పాలవెంకటాపురం గ్రామంలో వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి తాలూకా నాయకులు డిఎస్.మూర్తి, వైపి రమేష్, గొల్ల వెంకటేశులు, జడ్పిటిసి ప్రభావతమ్మ, మండల కన్వీనర్లు శ్రీరామిరెడ్డి, ధనుంజయ, తిప్పేస్వామి, మండల నాయకులు క్లస్టర్ ఇన్‌ఛార్జి ఓబులేష్, మాజీ ఎంపిపి భర్త వన్నూరుస్వామి, పెంకుల మల్లికార్జున, నారాయణ, భైరసముద్రం లింగన్న, లక్ష్మన్న, వేపులపర్తి భీమ, ముప్పులకుంట జనార్ధన, కోనాపురం నల్లమల్ల, సూగేపల్లి శీనప్ప, టిడిపి కార్యకర్తలు, మండల వాల్మీకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి నేటి తరంతోపాటు భావితరాలకు మార్గదర్శకమని మేయర్ మహమ్మద్ వసీం కొనియాడారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని నగరంలోని విగ్రహానికి జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బండి కిష్టప్ప

గార్లదిన్నె : వాల్మీకి జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న విగ్రహాన్ని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విగ్రహాన్ని పుర పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, ఇల్లూరు రామాంజనేయులు, సుంక, బిఎస్.రవి, పుల్లన్న, గురవ రఘు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : వాల్మీకి జయంతిని పురస్కరించుకుని రాయదుర్గం పట్టణంలోని పైతోట ఉన్న విగ్రహానికి పురపాలక మండలి ప్రతినిధులు పూలమాల వేసి పూజలు చేశారు. ఇందులో భాగంగా అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో రాయదుర్గం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప, మాజీ ఛైర్మన్, వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ వార్డు సభ్యులు పైతోట సంజీవ, శ్రీలక్ష్మి, శారద, లావణ్య, వైసిపి వార్డు ఇన్‌ఛార్జిలు శివ, రామాంజనేయులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. ఇకపోతే వాల్మీకి సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో వాల్మీకి కళ్యాణ మండపంలో సమితి అధ్యక్షుడు బండి కిష్టప్ప వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం శాంతినగర్‌లోని చంద్రబాబు పార్కు వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ భక్తకన్నప్ప విగ్రహానికి, మెయిన్ బజార్‌లో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సమితి నాయకులు సిద్ధప్ప మల్కన్నా, పద్మజ, రఘు, మల్లి, పవన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులు పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజినేయులు, రామకృష్ణ, సిద్దేశ్వర, చెన్నవీరా, చిత్రయ్య, మంజుల, శ్రీనివాసులు, లెక్చరర్,ఉద్యోగులు ఈశ్వర్, రామన్న, గోవిందా, ఈశ్వర్, మార్కెట్ యార్డ్, వేణు, మధు తదితరులు పాల్గొన్నారు. టిడిపి కార్యాలయంలో జరిగిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో పార్టీ పట్టటణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు తిప్పయ్య, సత్యనారాయణ శ్రీరాములు రవి, మహబూబ్ బాషా పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వాల్మీకి మహర్షి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని పలు ప్రధాన వీధుల గుండా ఊరేఇంచారు.

పామిడి : మండల కేంద్రంలని వాల్మీకి సర్కిల్‌లో ఉన్న వాల్మీకి ఆలయంలో మండల వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాల్మీకి విగ్రహాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఎడిసిసి మాజీ ఛైర్మన్ పామిడి వీరాంజనేయులు, మాజీ ఎంపిటిసి సంజీవకుమార్, వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య, మీసాల రామచంద్ర, కరూరు శివశంకర్, నిమ్మకాయల శీన, కొట్టాల ఓబులేసు, శంకర్, సుంకిరెడ్డి, కాలువగడ్డ రంగనాయకులు, అనుంపల్లి సుంకప్ప, వెంకటనారాయణ, బేల్దారి నాగరాజు, రాజేంద్ర, యల్లప్ప, నాగరాజు, వాల్మీకులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : వాల్మీకి సేవాసంఘం అనంతపురం పార్లమెంటు అధ్యక్షుడు బుల్లేట్ లింగమయ్య ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చాగల్లు గ్రామం నుంచి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి తాడిపత్రికి చేరుకుని యల్లనూరు రోడ్డులో ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.ఆదినారాయణ, చింతా పురుషోత్తం, పసల కంబగిరి, సురేష్, దేవేంద్ర, తలారి ఈశ్వరయ్య, రామకృష్ణ, సూర్యనారాయణ, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని అంకాలమ్మ వీధిలో ఉన్న వాల్మీకి విగ్రాహానికి పూజలు చేశారు. తర్వాత అంకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో యాడికి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరి రంగయ్య, నాయకులు త్రినాథ్‌రెడ్డి, దడియాల ఆది, నాగ మునిరెడ్డి, వాల్మీకులు పాండు, రవి, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలవ్యాప్తంగా వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంతోపాటు గోవిందవాడ, దర్గాహొన్నూరు, సింగేపల్లి, ఉద్యహాల్, కొళగనహళ్లి గ్రామాల్లో వాల్మీకి చిత్రపటాలను ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు ఊరేగింపు ముందు హారతులు పట్టారు. అనంతరం ఆయా గ్రామాల్లో అన్నదానాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో వాల్మీకి సంఘం మండల కమిటీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం : వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి అధ్యక్షతన గురువారం కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గిరిజ మనోహర్ రావు, డెమో త్యాగరాజ్, గంగాధర్, శ్రీనివాసులు, కిశోర్, సురేష్, కమలాకర్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : మండల వ్యాప్తంగా గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ, తదితరులు విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. అలాగే మండలంలోని తొండపాడు, బసినేపల్లి గ్రామాల్లో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరై వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని ఆత్మ రామాలయం ఆలయం వద్ద వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. రాత్రి పురవీధుల గుండా వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలకుమారి, వాల్మీకి సంఘం మండల నాయకులు, పెద్దఎత్తున వాల్మీకులు పాల్గొన్నారు.



వాల్మీకి జయంతిని ప్రారంభిస్తున్న ఎస్‌కెయు విసి, అధికారులు


రాయదుర్గం, గుత్తి, శింగనమలలో వాల్మీకి చిత్రపటాలు, విగ్రహానికి పూజలు చేస్తున్న నాయకులు, అధికారుల



బుక్కరాయసముద్రంలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపిపి దాసరి సునీత

పండుగలా 'పల్లె పండుగ'



బ్రహ్మసముద్రం మండలంలో భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలోని పడియంపేట, పొడరాళ్ల గ్రామపంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, సర్పంచి పి.నాగార్జున, ఎంపిడిఒ సొలమాన్‌రాజ్, ఇఒఆర్‌డి సదాశివ, పిఆర్ జెఇ మద్దిలేటి, ఎంఇఒ లింగానాయక్, పంచాయతీ సెక్రటరీ రంగారెడ్డి, నాయకులు ఫరిష శ్రీనివాసులు, బుల్లే నారాయణస్వామి, బుల్లే ఆదినారాయణ, మండల సచివాలయ ఇంజినీరింగ్, అసిస్టెంట్లు,ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని సోదనపల్లి, గుంజేపల్లి, నడిమిదొడ్డి గ్రామాల్లో గురువారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఒ గంగావతి, ఇఒఆర్‌డి శైలజారాణి, ఎపిఒ ఎర్రమ్మ, సర్పంచులు, ఎంపిటిసిలు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్లూరు : మండల పరిధిలోని ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట, మడుగుపల్లి పంచాయతీల్లో గురువారం పల్లె పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం కింద సిమెంటు రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అలివేలమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రవీణ్, ఎపిఒ చెన్నకేశవులు, సర్పంచులు, నాయకులు పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండల పరిధిలోని ఖాదర్‌పేట గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.10లక్షలు విలువజేసే పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తేజోష్ణ, టిడిపి సీనియర్ నాయకులు ముసలిరెడ్డి, ఇఒఆర్‌డి కృష్ణకుమార్, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండలంలోని బెప్పేపల్లి, కూచివారిపల్లి గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉరవకొండ : మండల పరిధిలోని నింబగల్లు గ్రామంలో గురువారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.17లక్షలతో సిసి రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బివి రవిప్రసాద్, టిడిపి నాయకులు కొకా భగవాన్, సిద్ధప్ప, జెట్టి.అన్వేష్, నెలపటి.నూతన్, బీఎం.మణికంఠ, కొంకా ప్రహల్లాద, ఎస్సీ సెల్ నాయకులు గోవిందు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి మండల కన్వీనర్ ప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నరసాపురం, వైవి.తండా, రామనేపల్లి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సిసి రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ టి.లక్ష్మీనారాయణ, ఎపిఒ సూర్యప్రకాష్, పిఆర్ ఎఇ పరుశురాం, టిడిపి నాయకులు మురళీచౌదరి, నరిగన్నచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల పరిధిలోని బుదేడు, కృష్ణాపురం, ముకుందాపురం పంచాయతీలో గురువారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, ఎపిఒ నాంచారమ్మ, ఇఒఆర్‌డి దామోదరమ్మ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని సర్పంచి మల్లెల వనిత అన్నారు. గురువారం మండల పరిధిలోని సంతే కొండాపురం పంచాయతీ కోనాపురం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ప్రభావతమ్మ, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఓబులేసు, మాజీ ఎంపిటిసి కరేగౌడ, స్కూల్ కమిటీ ఛైర్మన్ కరేగౌడ, డీలర్ నల్లమల, వైస్ సర్పంచి భర్త మంజు, అక్కన్న, నాయకులు దండు తిప్పేస్వామి, సూగేపల్లి సీనప్ప, శివ, పంచాయతీ కార్యదర్శి అనిత, సచివాలయ ఉద్యోగులు, ఉపాధిహామీ సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.






నార్పల, పామిడి, యల్లనూరు, ఉరవకొండ మండలాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు